వయసు

శ్రీసుధా

జీవితంలోనిసమస్యలన్నిటినీ పరిష్కరించనుకుని, వీకూచింతా లేకుండాఉండాలనుకోవడంలో తప్పేం వుంది కనుక? అందరూ ఏదో ఒక సమయంలో ఈ చక్కని అవస్థని ఊహించుకుని - అది దగ్గరపుయాన్న కొద్దీ పట్ట పగ్గాల్లేని సంతోష తరంగాల్లో పట్టీలు కొడుతూనే వుంటారు. అయితే ఈ అవకాశం ఎంతమందికి దక్కుతుందనే ప్రశ్న ఉదయిస్తే - అలా దక్కించుకున్న వారిని చూపించ మంటే మన చేతి వ్రేళ్లల్లోనగానికి పనే ఉండదు!

అవును శ్రీ మహా విష్ణువు అంతటి వాడు శేష శయనుడై పరుండగా, మహాలక్ష్మి సుతి మెత్తగా పాదాలు వత్తు తుండగా, దూరంలో నిండుడి నారద తుంబురాదులు సంగీత ప్రసక్తులై గాన లహరుల్లోతేలుస్తుంటే దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ లాంటి బృహత్ కార్యక్రమాలు తలకెత్తుకుని - ఆ పైన కాస్తంత పక్కకు ఒత్తిగిల్లి నేద దీర్చుకుంటున్న సమయంలో దేవ లోక వాసులు ఆర్త నాదాలూ ఆర్జీలతో శ్రీ వారిని కలవర పెట్టడం తెలియని విషయం ఏం కాదు!!

అయితే ఆ సమయానమహావిష్ణువులుంగారు ఎలా స్పందించారనేది వేరే విషయం. ఎందుకంటే మనం మానవ మాత్రులం. మన ఇబ్బందులూ, కష్టాలూ, సుఖాలూ వాటి చుట్టూ పరిభ్రమణాలు పూర్తి చేసుకుని గానీ భగవంతుడివైపు దృష్టిసారించడం లేని విపత్కర పరిస్థితుల్లో మనం పడిపోయాం!! నిజమే నిలువెత్తు జీవితాన్ని, దాని బరువునీ మోయలేక క్రింద మీదా అయ్యే రోజుల్లో స్వంతాన్ని మించిందీ, స్వార్థాన్ని మించిందీ ఏముంటుంది గనుక!!

ఇంతకీ యివన్నీ ఎందుకు సమీక్షించవలసి వచ్చిందంటే సరిగ్గా మహా విష్ణువు గారి లాగ నేద దీర్చుకునే స్థితిలోకి అవస్థలోకి జారి ఉన్నారు, మూర్తి గారు! పిల్లలు ఎదిగి, అందులో ఆడపిల్లలయితే పెళ్లిళ్లు పూర్తి అయి అత్త వారింటికి వెళ్లిపోగానే చాలా మంది బంధు జనం, లేక మిత్ర కోటి 'గట్టెక్కేశావు' అంటూ భుజాలు తట్టి మొదటిసారి మెచ్చుకున్నారుఅయన్ని. ఆ తర్వాత, మగ పిల్లలు చదువులు పూర్తి చేసుకుని వివాహాలు కానిచ్చి ఉద్యోగాల్లో స్థిరపడ్డ రోజున -'నువ్వు ఇక వాన ప్రస్తానానికి నడుం బిగించవచ్చు' సలహా లాంటిది విసిరారు!

మూర్తి గారు అప్పుడు నవ్వేసి గుంభనంగా మిగిలిపోయినా, ఆ విషయం గురించి ఆలోచించవలసిన అవసరం ఆయన రిటైరైన రోజు నుంచి కాస్తంత కదిలి అలజడి లాంటిది పుట్టించింది. ఆయన ఉద్యోగ విరమణ చేసి ఒక నెల రోజులు కాలేదు. కానీ పాత అలవాట్లు పద్ధతులూ మాత్రం అంత త్వరగా వారిని ఒదిలి పెట్టలేదు. అందుకే, ఆయన ఉదయమే లేచి త్వరత్వరగా కాలకృత్యాలుతీర్చుకుని స్నానాదులు పూర్తి చేసి వంట కాలేదా అంటూ భార్య లక్ష్మిని ఒకటికి రెండు సార్లు హెచ్చరించబోయి నాలిక కరుచుకోవడం, ఆ తర్వాత పేపరు చాటున మొహం దాచుకోవడం లాంటి ఒకటి రెండు సంఘటనలు నాలుగు రోజులకో మారైనా ఎదురయ్యేవి. అటు లక్ష్మి కూడాఇంటింట్లో అలవాటుగాఅష్టావధానం చేయడానికి నడుం బిగించి, ఆ పైన తన మతి మరుపు తనానికి నాలుగు మొట్టికాయలు వేసి, వెనుకటి రోజుల్లో హృదయపూర్వకంగా పఠించని వెంకటేశ్వర సుప్రభాతం - లెంపలు వేసుకుని దీక్షతో, తాపీగా చదవడం చేసుకునేది... ఒక్కొక్క రోజు, తీరిక చేసుకుని భార్యా భర్తలిద్దరూ కలిసి జీవిత సింహావలోకనం చేసుకునేవారు. సంసారపు తొలి రోజులు - పిల్లలు పుట్టడం - వాళ్ల మారాములు, చదువులు ఇంకా ఇంకా వారి పెళ్లి ముచ్చట్లు - అలా పాత విషయాల్ని ఎంతగా తవ్వి తలకెత్తుకున్నా కాలం భర్రుమనట్టు కనబడక ఒకళ్ల మొహాలు ఒకరు చూసుకునేవారు. అప్పుడప్పుడు యిద్దరూ ఒక నిర్ధారణకు వచ్చినట్టు, వెనకటిలా రోజుకు ఇరవై నాలుగు గంటల వ్యవధి కాకుండా కాస్త పెరిగినట్టు కనబడులోందని సుందరవ్యాఖ్యలుచేసుకునేవారు - కూడ బలుక్కుని!! తెల్ల వారితే అపరాహ్నం అవాలని, అది దగ్గరయితే సాయంకాలం ఎప్పుడవుతుందనీ - ఆ తరువాత ఎంతకీ చీకటి పడ్డం లేదని మీమాంశలో పడేవారు! అవి శాంతికి అలవాటు పడలేక వి శాంతికి కాస్తంత మొహం మొత్తినట్టు మొహాలు పెట్టుకునేవారు.

"ఏమిటోనే ఇంట్లో కూర్చోవాలంటే విసుగ్గా అనిపిస్తోంది"

"అలవాటు పడాలి..."

"నీకే బాధా లేదు... అందుకేఅన్నారు ఆడజన్మలో హాయి వుందని... ఇలాంటి అవస్థలు మీకు వుండవు..."

"మీ నోటితోనే కదండీ... ఉద్యోగాన్ని తెగ శాపనార్థాలు పెట్టేవారు. ఆఫీసు, ఆఫీసరు అంటూ తెగ విసుక్కునే వారు... ఇప్పుడు మిమ్మల్ని విసిగించే దెవరు... అధారిటీ చేసేదెవరు?" మూర్తి గారు మాట్లాడలేక పోయేవాడు!

"ఇంట్లో కూర్చుంటే మీకు తోచడం లేదు... కాస్త అలా బజారుకు వెళ్లిరండి..."

"ఏం నేను ఇంట్లో వుంటే నీకూ విసుగనిపిస్తోందిలా వుంది..." అందులో కాస్తంత వెటకారం వున్నా, పిసరంత ఉక్రోషం వుంది.

"బావుంది..."

"ఏం బావుంది?..."

మూర్తి గారు రెండు నెలలయినతర్వాత కొద్దిగా ఇంటికీ, వాకిట్లో వాలు కుర్చీకి, పేలవంగా ఉంటున్న దిన వారపత్రికలకూ, అప్పుడప్పుడు వచ్చి ఉబుసుపోక కబుర్లు చెప్పే స్నేహితులకూ అలవాటు పడ్డం నేర్చుకున్నాడు! సరిగ్గా అప్పుడే కొడుకు ఫణిభూషణం ఉత్తరం వ్రాశాడు. అందులో, తను వారం రోజుల్లో వస్తున్నాననీ, తనతో పాటు బొంబాయి రావడానికి సిద్ధంగా వుండమనీ - ఈవిషయంలో రెండోమాట లాంటిది పెట్టుకోవద్దని - వ్రాశాడు. రెండో వేరాలో - రిటైరయిన తల్లిదండ్రులు వేరే ఆలోచన పెట్టుకోకుండా కొడుకు దగ్గర స్థిరపడ్డం సాంప్రదాయంగా తనుభావిస్తున్నాననీ - కోడలు వాణి కూడా అదే అభిప్రాయంలో వుందనీ - పిల్లలు, తాతగారూ బామ్మా యింకా రాలేదమనిరోజూ అడుగుతున్నారనీ విశేషాలు వ్రాశాడు.

మామూలుగా అయితే రిటైరయిన తర్వాత భార్యతో కలిసి ఏకాకులుగా జీవితాన్ని వెళ్లదీయడం ఎవరూ కోరుకోరు. అలవాటుగా కొడుకుల దగ్గరకు వెళ్లి స్థిరపడ్డం కూడా రివాజే! అయితే మూర్తి గారి పద్ధతి వేరు! చేసిన ఉద్యోగం మంచిది. దానికి తోడు హోదా కలిగింది! ఆయనకు సంసారం చేయడంలో, పొందిగ్గా ఖర్చు పెట్టడంలో మెలుకువలు తెలుసు... స్వంతయిల్లు వుంది... ఊరిలో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఆయన స్వాభావికంగా పదవీ విరమణ చేశారు గానీ శరీరంలో జవసత్వాలకు లోటేం లేదు. అటు లక్ష్మి కూడా ఆయనకు నూటికి నూరు పాళ్లు తగినదే!

కొడుకు ఉత్తరం చదివి మూర్తి గారు అందుకే అన్నారు.

"మనం ఈ ఊరు విడిచి ఫణి దగ్గర ఎందుకు ఉండాలిట? వాళ్లని చూడాలనుకున్నప్పుడు వెడితే చాలదూ... హాయిగా ఈ ఊర్లోనే ఉందాం!"

"అంటే..."

"ఈ ఊరి మంచి డోలూ దవాలు కట్టేసి వెళ్లనవసరం లేదంటున్నాను..."

"పాపం వాడు బాధ పడతాడండీ..."

"పదేళ్లు లేని బాధ ఈ వేళ దేనికి?"

"వాళ్లు మనకి దూరంగాఉన్నారనిఇంత కాలం మనం అనుకోలే. ఇదీ అలాగే! అయినా మనకిప్పుడు ఏ ఊరయితేమటుకు ఏమిటి... ఎలాగయినా వాడి దగ్గర..." ఆవిడ ఆగింది.

"వాళ్లు స్వతంత్రంగా స్వేచ్ఛగా బొంబాయిలో ఇంతకాలం నుంచీ ఉంటున్నారు. మనం కూడా ఇక్కడ అలాగే వున్నాం... ఇప్పుడలా కాదే... నేనేం గణించడం లేదు."

"అవ్వ" లక్ష్మి బుగ్గలు నొక్కుకుని- ఆ ప్రక్రియతో పాటు మొహం మీదకు నవ్వు గుమ్మరించుకుని,

"ఫణిగాడి సంగతి మీకు తెలియదా, ఆలోచించండి" అంది.

"నాకేం అర్థం కావడం లేదు..."

అన్నట్టే ఫణిభూషణంవచ్చాడు. మూర్తి గారు ఆ ఊరి నుంచి పూర్తిగా బిచాణా ఎత్తేసి - కొడుకు దగ్గర పెర్మనెంటుగా స్థిరపడ్డానికి ఒప్పుకోలేదు. అలాగని ఆ మాట నిష్కర్షగా చెప్పలేదు. ముప్పయ్ఏళ్లసంబంధ బాంధవ్యాలు త్వరగా తెగవని వేదాంత పరంగా చెప్పాడు. ఈ వేళ కాకపోయినా తప్పని రోజు వచ్చినప్పుడు మాద్దాం - తొందరేముందని వైరాగ్య అంశతో మాట్లాడాడు! పిల్లలు జ్ఞాపకం వస్తున్నారు... కాస్తంత గాలి మార్పుఅంటూహుందాగాను మాట్లాడాడు! అయితే లక్ష్మిగారు భర్తకీ కొడుక్కీ మధ్య మధ్యవర్తిగా మాట్లాడి ప్రయాణానికి ముహూర్తం పెట్టింది! దానికి కారణం కోడలు నెలలు నిండి ఒక్కత్తీ క్రింద మీదా పడుతోందని కొడుకు తలవాల్చుకుని శుభవార్త చెప్పడం ఒకటి!! అదే భర్తతో ఆవిడ ఆ రాత్రి చెప్పింది.

"ఈ విషయంవాడుఉత్తరంలో వ్రాయలేదుగా" అన్నాడాయన ఆలోచనగా!

"బావుంది... సిగ్గుపడి వుంటాడు..."

"అవునవును..."

***

మూర్తి గారికీ లక్ష్మికీ బొంబాయి, అక్కడి వాతావరణంకొత్తేం కాదు! పదేళ్లల్లో వాళ్లా నగరం ఐదారుసార్లు వెళ్లిందే!! పైగా ఫణి ఉంటున్న కాలనీలో మూర్తి గారికి లక్ష్మికీ స్నేహితులు ఉన్నారు...

ఇరవై ఏళ్లుగా కొడుకు దగ్గర స్థిరపడ్డ ప్రవాసాంధ్రుడు, పద్మనాభం గారు, సరేసరి!!

"ఏమిటి మీరు రిటైరయ్యారని తెలిసింది... ఎలా వుంది లైఫ్. అయితేకొడుకు దగ్గరకు వచ్చేశారన్న మాట... మన లాంటి వాళ్లకు తప్పదు - ఈ దశ..." అంటూ పిండి మర ఆడించినట్టు మాటలుచెరగడం మొదలు పెట్టాడు.

"ఒట్టినే చూసి వెడదామని వచ్చాం..."

"అబ్బో" అంటూ నవ్వేశాడు. ఆ మాటల్లో నిజం లేదు. కాస్త అబద్ధం పాలు మాత్రమే వుందని చెప్పకనే చెబుతూ.

మూర్తి గారికి ఒళ్లుమండేదిపద్మనాభం గారిని చూస్తే! ఆ మంట చల్లారకుండానే చేతి సంచీ ఒకటి పట్టుకుని ఆయన ప్రత్యక్షమయ్యేవాడు.

"రండి మూర్తి గారూ అలా దాదర్ దాకా పోయి వద్దాం. మీరు ఓ సంచీ తీసుకురండి. కూరలు గట్రా కొందాం..."

"అబ్బాయి చూసుకుంటాడు లెండి... ఆ విషయాలు..."

"అయ్యో. అలా అనకూడదండీ... మన వంతు పని మనం చేసుకుంటూ పోవాలి. తిని కూర్చున్నారని అనిపించుకోవడం మనకి బాగా వుంటుందా చెప్పండి..."

మూర్తి గారు "మీరు వెళ్లి రండి. నేను రాలేను" అనే లోపునే లక్ష్మి వచ్చి "ఆయన తోడు ఉన్నారుగా. వెడితే ఏమయ్యిందిటి?" అంటూ ఉచిత సలహాతో పాటు సంచీ కూడాఅందించింది.

లక్ష్మి వంటింట్లో పని చేసుకుంటూ అల్లరి చేస్తున్న మనవల్ని "పోయి తాతగారి దగ్గర కూర్చోండనో, వీళ్లకి కాస్త చదువు చెప్పకూడదుటండీ" అన్నప్పుడు తిరిగికోపం తలెత్తుతూనే వుండేది. అయినా పాపం కోడలు వాణి వారిస్తూనే వుండేది.

"వీళ్లు ఆయనకు లొంగరుఅత్తయ్యా" అంటూ.

"ఆయన ఒట్టినే కూర్చుని ఏం చేస్తారమ్మా" అని లక్ష్మి వ్యాఖ్యానం చేసేది. అప్పుడూ మూర్తి గారు ఆవేశంతో ఊగిపోయేవాడు. అర్ధరాత్రి వేళ భార్యని లేపి "నీరసంగా కనిపిస్తున్నావ్... ఇంటి వాకిలీ నెత్తిన వేసుకుని తరువాత మంచం పడితే కష్టం సుమా..." అన్నాడు.

"ఖాళీగా ఎలా కూర్చుంటాను చెప్పండి... అది నెలలు నిండినమనిషి..."

"బాగానే వుంది..." నిట్టూర్చాడు మూర్తి గారు.

"అమ్మాయి ఏమంటుంది?"

"వాణా, ఏమంటుంది, మామూలే"

"మనం ఇక్కడికి వచ్చి ఉంటున్నామనీ - ఊరికే కూర్చుని..." లక్ష్మి చిన్నగా నవ్వేసింది. "అదేమిటండీ ఆ మాటలు... ఆ అమ్మాయి మనం ఎరగని పిల్లా... కాపురానికి వచ్చి పదేళ్లయింది... మనతో విప్పుడో కలిసిపోయింది..."

మూర్తి గారికేం మాట్లాడాలో తోచలేదు. "అమ్మాయి సంగతి ఒదిలిపెట్టు వాడి సంగతి! ఈ రోజుల్లో జీతాలు, ఖర్చులు ఎలా పెరిగిపోయాయని..."

లక్ష్మి మాట్లాడలేదు.

"మళ్లీ వాడితో అనకు - ఊరి నుంచి నా చెక్ యిక్కడికి వచ్చింది, నిన్నే. అది వాడి ఎకౌంట్‌లో జమ చేసేశాను.." లక్ష్మి భర్త మొహం చూసింది...

"నెన్నీళ్లకు చన్నీళ్లు తోడన్నారు, ఏమంటావ్..."

లక్ష్మి నవ్వేసింది. ఆ పైన నవ్వు ఆపుకుని "మీరు ఏమన్నా అంటే ఒప్పుకుంటారేమిటి? ఇరవై ఏళ్లు ఆఫీసరుగా పనిచేసి రిటైర్ అయిన మూలంగామీకింకాఆఫీసరు బుద్ధులు పోలేదు. పెళ్లాం, కొడుకు, కోడలు అందరూ కూడా మీకు క్రింద ఉద్యోగస్తుల్లా కనిపిస్తారు. అవును కదూ" అంది.

"బెల్లం పెట్టే వండినా, కందకి దురద మిగిలే వుంటుందనేది మా అమ్మ..."

"పడుకోండి..."

"అది సరే... రామచంద్రాపురం నుంచి మన వీరభద్రంగారు ఉత్తరం ఏం వ్రాయలేదు... ఇల్లూ అది చూస్తున్నాడో లేదో..."

"మనింటికేమండి... గ్రాడేజ్ వాళ్ల తాళాలు ఒకటి కాదు, రెండు వేశాను..."

"బొంబాయి అనుకుంటాం గానీ ఈ ఊళ్లో ఏం వుందే... రామచంద్రాపురం కాలి గోటికి రాదీ ఊరు... ఏమంటావ్?"

"నేనేమనను... రేపు తెల్లారి మనవడు రవిగాడితో ఈ మాట అనండి... చిరతపులిలా మీదకు ఉరకకపోతే ఒట్టు..."

"అవునేవ్... వాడు చిరతపులి కాదు... బావురుపిల్లి"

అలా చాలా సేపు కబుర్లాడుకున్నతర్వాత గానీ ఆ భార్యా భర్తలు నిద్రపోలేదు. అయితే ఇద్దరిలో ఆలస్యంగాకన్నుమూసింది మూర్తిగారే.

***

రామచంద్రాపురం నుంచి వీరభద్రం ఉత్తరం వ్రాశాడు. మూర్తి గారు ఆతృతగా ఉత్తరం చింపి, సగం చదివి 'ఏమే' అంటూ ఒంటింట్లోకి కేక పెట్టగా దానికి జవాబుగా అక్కడి నుంచి చారులో తాలింపు పెడుతున్న ధ్వనీ - మరొకసారి "నిన్నే, వినబడలా" అంటూ కాస్త హెచ్చుస్వరంతో పిలిస్తే - ప్రతిగా ప్రెషర్ కుక్కర్ కూత వినిపించడం జరిగింది. ఆయన లేచి వంటింటి దాకా వెళ్లి "వీరభద్రం ఉత్తరం వ్రాశాడు... ట్యుటోరియల్ కాలేజీ, ఈ నెల్లోనే ప్రారంభిస్తున్నారుట... నన్ను వెంటనే బయలుదేరి రమ్మన్నాడు..."

'అలానా' అంటూ లక్ష్మి ఆఉత్తరంచేత తీసుకుని కళ్లజోడు కోసం, కిటికీఅంచులు, అల్మారా, డ్రాయర్ చొరుగులు వెదికి, అది కనబడక 'బాగానే వుంది' అంది. ఆ తరువాత "ఇప్పుడు మనం వెళ్లిపోతేఎలా... బారింతరాలు పసిగుడ్డుతో ఇబ్బంది పడుతుంది..."

"నేను వెళ్లకపోతే అక్కడమేధమెటిక్స్ చెప్పేదెవరు? మనల్ని నమ్ముకునే కదా వాళ్లు కాలేజీ ఏర్పాటు చేసుకున్నది..."

సాయంకాలం ఫణిభూషణం ఆఫీసు నుంచి రాగానే, వాణి విషయాన్ని అతని చెవిని వేసింది. అప్పటికే డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చి మూర్తిగారు 'అవునురా' అన్నాడు. ఫణి కాఫీ తాగుతూ క్రిందకి చూస్తూ నమ్రత తెచ్చి పెట్టుకున్నస్వరంతోఅన్నాడు. "ఇంతకాలం ప్రభుత్వ ఉద్యోగం చేశారు. చాల్లేదండి... ఇప్పుడీ ట్యుటోరియల్ కాలేజీలో ఉద్యోగం - అంత అవసరం ఏం వచ్చిందని... మీరు మా దగ్గర ఉంటే నాకూ వాణికీ కూడా తృప్తి... పిల్లలు కూడా మీకు అలవాటు పడ్డారు.

"అవును అత్తయ్యా... మనం అందరం ఒక చోట ఉంటే బావుంటుంది. నాకూ లంకంత క్వార్టర్స్‌లో ఒక్కత్తీ ఉండాలంటే అదోలా ఉంటోంది... మీ అబ్బాయి ప్రొద్దున్న వెళ్లి, రాత్రి తొమ్మిది గంటలకు ఇల్లు చేరతారు. పిల్లలు సరేసరి..."

"మీరు సంపాదించింది చాలు. మనకు డబ్బు సమస్యలు లేవు. రానని రానేయ్యండి నాన్నగారు. పైగా మీ ఆరోగ్యం కూడా చూసుకోవాల్సి వుంది"

మూర్తి గారు నవ్వేసి "అమ్మాయి చెప్పింది చూడు, ఒంటరిగా ఇంట్లో వుండలేకపోతున్నానని నాకూ అదే ఇబ్బందిరా. గోళ్లు గిల్లుకుంటూ కూర్చోడం కష్టం. తిరిగే కాలూ, తిట్టే నోరు అన్నారు... ఓ రెండేళ్లు అక్కడ కాలక్షేపం చేయవి" అన్నారు.

వారం రోజుల తర్వాత మూర్తి గారు లక్ష్మి మినార్‌లోస్వగ్రామంబయలుదేరారు. స్టేషన్‌కు ఫణిభూషణం, వాణి పిల్లలూ వచ్చారు. వాళ్లతో పాటు పద్మనాభంకూడా వున్నాడు... ఆయన, మూర్తి గారిని కబుర్ల లోకి పెట్టి, సెంట్రల్ స్టేషన్ చూపించే నెపంతో పక్కకు తీసుకువెళ్లి "మొత్తం మీద పిల్లల దగ్గర ఉండకుండా ఏదో నెపం పెట్టుకుని వెళ్లిపోతున్నారు. మీ వరుస చూస్తే నాకు అనుమానంగా వుంది. మనసు కష్టపడిందా..." అడిగాడు అనుమానంగా. మూర్తిగారు ఆశ్చర్యపోయాడు.

ప్లాట్‌ఫారం మీదకు రైలు వచ్చింది... మూర్తి గారూ లక్ష్మి రైలు ఎక్కారు. వీడ్కోలు చెప్పి వెళ్లిపోయారు, కొడుకూ కోడలూ, పిల్లలూ, పద్మనాభంగారూనూ!!

"మొత్తం మీద మీ కోరిక నెరవేరింది" అంది కోడలు యిచ్చిన పులిహోర పొట్లాం విప్పుతూ లక్ష్మి.

"అంటే"

"మీ మా[illegible]గించుకున్నారుగా. పిల్లవాడి మీద ఆధారపడకూడదనేగా మీ పట్టుదల"

మూర్తి నవ్వేశారు. "చూడు, పిల్లలు, అదే కొడుకూ, కోడలూ మనవలూ అంతా మన వాళ్లేనే... వాళ్లని ఏడాదికో సారి చూడాలని నువ్వెంత యిదవుతావో, నేనూ అదే విధంగా అనుకుంటాను... కానీ పరబ్రహ్మంగారు అన్నట్టు ఈ కాలం పిల్లలూ, వాళ్ల అభిప్రాయాల్లో కాస్తంత హ్రస్వదృష్టి, అంతః కరణలో ఒక్కింత అపశృతి కనిపిస్తున్నాయి. వాళ్లు బాధ్యత అనే మాటకు బరువు మోయడం అని అర్థం చెప్పకుంటారు. కానీ జీవితానికి ప్రేమను ఎలా అన్వయింప జేసుకోవాలో ఇంకా వాళ్లకు తెలిసి రావలసి వుంది..."

"మన అబ్బాయి, కోడలు అలాంటి వారు కాదండి..."

"కోడలు పట్టుచీర పెట్టిందిగా. వెనకేసుకురాకేం చేస్తావులే..." ఇద్దరూ నవ్వుకున్నారు. ఇంతలో మూర్తి గారు ఏదో గుర్తు వచ్చినట్టు "ఒక్కమాటచెప్పనా" అన్నాడు.

"ఏమిటట..."

"మన ఊళ్లో ట్యుటోరియల్ కాలేజీ, ఉద్యోగం అంతా అబద్ధమేనే! వీరభద్రాన్ని నేనే ఓ ఉత్తరం వ్రాసిపడవేయమన్నాను... లేకపోతే ఫణిగాడు మన ప్రయాణానికి ఒప్పుకోడుగా..."

"ఇంత అబద్ధమా... అమ్మో... అయినా తెలియక అడుగుతాను. బొంబాయిలో ఉండడానికి మీకు ఇబ్బంది ఎందుకనిపించాలి... ఇద్దరూ కలిసి రోజూ బండరాళ్లు మోయవలసి వచ్చిందనా? హాయిగా పిల్లలతో కాలక్షేపం అయ్యేది. ఎంత మన ఊరయినా మనం ఇంట్లో మనం ఒకళ్ల మేగా వుండేది. ఏమిటో... మీరు చేసే పన్లకి ఒక్కొక్కసారి అర్థం వుండదు..." అంది నిరుపేక్షగా.

"ఆ, నీకేం నువ్వెన్నయినా చెప్తావు... పిల్లల మీద ఆధారపడి ఒట్టినే తింటూ ఎలా కూర్చో బుద్ధి వేస్తుంది. ఎంతైనా అది ఫణిగాడి ఇల్లులా అనిపిస్తుంది గానీ - మనిల్లు అన్పించదు. పైగా నిన్నటి దాకా ఉద్యోగం వెలగబెట్టిన కాయమాయె ఇది! పాత వాసనలు త్వరగా పొమ్మంటే పోతాయా? అందుకే ఈ కాయానికి మన ఊళ్లో తత్వంతో సావ బట్టి - విషయ వాంఛలకు విరుగుళ్లు నేర్చుకుని - ఆ తర్వాతే" మూర్తి గారు చెప్పుకుపోతున్నాడు.

లక్ష్మి-భర్త మాటలు వింటోంది. తాము రైల్లో ఉన్నట్టూ అది వేగంగా పరిగెడుతున్నట్టూ కూడా మర్చిపోయింది. ఎందుకంటే అప్పుడు, ఆవిడకు భర్తలో సహవాసి కనిపించలేదు. రిటైరయినఆఫీసరుకన్పించలేదు. నిర్మలాకారంలో ఉండి, రూపు దిద్దుకుంటున్న ఓ పసితనం కనిపించింది. ఏనాడో ఏళ్ల క్రితం, పిల్లల్ని పెంచి పెద్ద చేసిన ఆవిడలోని మాతృ హృదయం - భర్తలో కన్పించే అమాయకత్వం, మంకుతనం చూసిమరోసారిగుండెనిండుగా నవ్వుకుంది!!